సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 30 । జూన్ । 2024


ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయండి 8లో


నైపుణ్య ఆధారిత విద్యకు ప్రాధాన్యం 8లో


మైమరపించిన మాయాబజార్ 8లో

అన్నింటా మేటి.. ఏయూ

వీసీగా ప్రసాదరెడ్డి హయాంలో అద్భుత ప్రగతి

- అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు
- జాతీయ స్థాయిలో తొలి 3 యూనివర్సిటీల్లో స్థానం
- విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక కోర్సులు
- ఆవిష్కర్తలుగా విద్యార్థులు, స్టార్టప్‌లకు హబ్‌గా విశ్వవిద్యాలయం
- ఏయూ ఓ దెయ్యాల కొంప అంటూ ప్రతిష్టని దిగజార్చిన టీడీపీ నేతలు
- 2014 నుంచి 2019 వరకూ రాజకీయ కేంద్రంగా మార్చేసిన వైనం



ప్రైవేటు వర్సిటీల అడుగులకు మడుగులొత్తుతూ.. ప్రతిష్టాత్మక యూనివర్సిటీని టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మసకబారిపోయిన ఆంధ్ర విశ్వవిద్యాలయం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో కొత్త ఊపిరులందుకుంది. తమ ప్రైవేటు వర్సిటీ ఎదుగుదల కోసం ఏయూ ఓ దెయ్యాల కొంప అంటూ టీడీపీ నేతలు దిగజారుడు వ్యాఖ్యలు చేయడంతో పాటు మొత్తంగా రాజకీయ కేంద్రంగా మార్చేశారు. కానీ వీసీగా ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత నాలుగేళ్ల కాలంలో సమాజ ఉపయుక్తంగా, పరిశ్రమల అవసరాలు తీర్చే వైవిధ్య పరిశోధన కేంద్రంగా ఏయూ మారిపోయింది. విద్యార్థి అభివృద్ధికి మార్గదర్శిగా.. పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా ఏయూను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తీర్చిదిద్దారు. వివిధ దేశాలు, యూనివర్సిటీలు, సంస్థల ఒప్పందాలతో ప్రతి విద్యార్థిని ప్రోత్సహిస్తూ ఏయూకు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు.


ఎలిమెంట్ భవనం

సాక్షి, విశాఖపట్నం : ఏయూను అత్యుత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్న గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఉపకులపతి ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి తన హయాంలో ప్రతిష్టాత్మకమైన నిర్ణయాలు అమలు చేశారు. వర్సిటీలో చేరే ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు తీసుకొచ్చిన సంస్కరణలు విశ్వవిద్యాలయాన్ని మరో మెట్టు ఎక్కించాయి. ఏయూ జాతీయ స్థాయిలో నాక్ డబుల్ ప్లస్ గ్రేడ్‌ని, 3.74 సీజీపీఏ సాధించి సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఈ గుర్తింపు 2030 వరకు ఉంటుంది. ఆచార్యుల కొరత ఉన్న సమయంలో కూడా ఏయూ ఇంతటి విశిష్ట ర్యాంక్ సాధించడం.. జాతీయ స్థాయిలో తొలి మూడు విశ్వవిద్యాలయాలలో ఒకటిగా నిలవడం వెనుక ప్రసాదరెడ్డి పాత్ర శ్లాఘనీయం.

విశ్వవిద్యాలయం నలుదిశలా ప్రగతి

అప్పటి వరకూ మూసధోరణిలోనే విద్యా బోధన సాగించిన ఏయూలో.. ప్రసాదరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక మార్పులు తీసుకొచ్చారు. విద్యార్థులను ఆవిష్కర్తలుగా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏయూ–నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని రూ.27 కోట్లతో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో గతంలో లేని విధంగా సొంతంగా ఒక స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ ఆ–హబ్‌ని తీర్చిదిద్దారు. టీ–హబ్‌కు దీటుగా.. ఆ–హబ్‌లో ప్రస్తుతం 150కి పైగా స్టార్టప్ సంస్థలు ఇక్కడ నుంచి సేవలు అందిస్తూ వేలాది మంది యువతకు ఉపాధిని సైతం అందిస్తున్నాయి. ఫార్మా రంగంలో స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రంగా ఎలిమెంట్ తీర్చిదిద్దారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్), అవంతి ఫీడ్స్ సంస్థ సహకారంతో ఏర్పాటైన ఏయూ–అవంతి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెరైన్ సంబంధిత రంగాలలో విశిష్ట పరిశోధనలు జరుపుతూ ఈ రంగానికి అవసరమైన నిపుణులను తీర్చిదిద్దే ప్రక్రియలో విజయవంతంగా పనిచేస్తోంది.


ఆ–హబ్

ఆర్ఐఎన్ఎల్ సహకారంలో హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో బయోఆర్బర్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని, ఏయూ పూర్వ విద్యార్థి రవికిరణ్ స్థాపించిన టికాబ్స్–ఇ జీవ శాస్త్ర సంబంధ పరిశోధనలు, ఆవిష్కరణలు చేస్తూ విద్యార్థులు పేటెంట్లు సాధించే దిశగా పనిచేస్తోంది. జియో ఇంజనీరింగ్ ప్రాధాన్యతను ముందుగానే గుర్తించి జియో ఇంజనీరింగ్ విభాగాన్ని పటిష్టపరిచారు. రూ.67.5 కోట్లతో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ) సంయుక్తంగా ఏయూతో ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఫుడ్ టెస్టింగ్, ఇంక్యుబేషన్ కేంద్రం ఏయూలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏపీ ఫుడ్ సొసైటీ రూ.5 కోట్లు దీనికోసం మంజూరు చేసింది. ఏయూలో సేవలందిస్తున్న డిజిఫాక్ సంస్థకు వేలాది మంది యువతకు లో కోడ్ టెక్నాలజీపై శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలను కల్పించేలా మార్పులు తీసుకొచ్చారు.

ఆక్రమణదారుల చెర నుంచి..

ఏయూకి చెందిన విలువైన ఆస్తులను టీడీపీ నేతలు తమ కబంధ హస్తాల్లోకి తీసుకున్నారు. వర్సిటీ చుట్టూ ఉన్న భూములను దశాబ్దాలు గా ఆక్రమించి వ్యాపార సముదాయాలు నిర్మించేశా రు. వర్సిటీ గ్రౌండ్, దాని పరిసరాలన్నీ పొదలతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. ఆక్రమణల పర్వంపై వీసీ ప్రసాదరెడ్డి ఉక్కుపాదం మోపారు. రూ.400 కోట్ల విలువైన స్థలాల్ని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకునే కార్యక్రమాలు చేపట్టి.. ఆ స్థలాలు విద్యార్థులకు ఉపయుక్తంగా మలిచారు. నవ్య ఆలోచనలతో పనిచేసి.. నూతన ప్రాజెక్టులను చేపట్టి విశ్వవిద్యాలయం ప్రగతికి బాటలు వేస్తే.. రాజకీయ కుట్రలతో టీడీపీ ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చి రాజీనామా చేయించి.. పచ్చపత్రికల సాయంతో టీడీపీ నేతలు అడ్డగోలుగా రోతల రాతలు రాయిస్తున్నారు.

98 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా..

మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు నూతన హాస్టల్ నిర్మాణం, ప్రయోగశాలలు, మౌలిక వసతులను కల్పించారు. 98 సంవత్సరాల వర్సిటీ చరిత్రలో ఫార్మసీ కళాశాల విద్యార్థినులకు తొలిసారిగా ప్రత్యేక హాస్టల్ భవనాన్ని కళాశాలకు చేరువలో నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. వర్సిటీ విద్యార్థులకు వసతి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ నూతనంగా ఆరెంజ్, మెటా–హెచ్ హాస్టల్స్‌ను నిర్మించడంతో పాటు విద్య ప్రగతి విహార్, విద్య తరంగిణి విహార్ హాస్టల్‌ని నూతనంగా ఆధునీకరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటితో పాటు శాతవాహన హాస్టల్‌ని పూర్తిస్థాయిలో బలోపేతం చేశారు. ప్రతీ విభాగంలో టాయిలెట్స్, విద్యార్థినుల రెస్ట్‌రూమ్‌లను పూర్తిగా మార్పుచేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌కి పూర్వవైభవం తీసుకువచ్చారు.

డ్రోన్ టెక్నాలజీకి చిరునామాగా..

విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీలో యువతను మలచడానికి ఉపయుక్తంగా ఏయూలో ప్రత్యేకంగా డ్రోన్ టెక్నాలజీ కేంద్రాన్ని ప్రసాదరెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేశారు. వీరికి ఉపయుక్తంగా ఏయూలో మూడు హెలీప్యాడ్లను అందుబాటులో ఉంచారు. డ్రోన్ టెక్‌లో విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల అవసరాలు అనుగుణంగా నూతనంగా అల్గారిథమ్ భవనాన్ని నిర్మించారు. దీనిలో ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు ఉపయుక్తంగా ఒక అంతస్తును కేటాయించారు. విశాలమైన తరగతి గదులు, సమావేశ మందిరాలు దీనిలో నిర్మించారు. నాలుగేళ్ల కాలంలో ఏయూలో విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగి నేడు 55 దేశాలకు చెందిన వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తుండటం విశేషం.


అల్గారిథమ్ బిల్డింగ్

టీడీపీ హయాంలో రాజకీయ కొంపగా..

2014 నుంచి 19 వరకూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఆ పార్టీ నేతలు తమ సొంత జాగీరులా మార్చేశారు. టీడీపీ మహానాడు మొదలు ఆ పార్టీకి సంబంధించిన ప్రతి సభకు అడ్డగోలుగా అనుమతిలిచ్చేశారు. 2017 మే నెలలో టీడీపీ మూడురోజుల పాటు విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో మహానాడు సభలు నిర్వహించింది. ఇందుకోసం ఏయూను ఇష్టారాజ్యంగా వినియోగించేశారు. ఆ తర్వాత 2018 మేలో ఇదే ఏయూ గ్రౌండ్స్‌లో ధర్మపోరాట సభ పేరిట తెలుగుదేశం పార్టీ బహిరంగసభ నిర్వహించింది. 2017 ఆగస్టులో జ్ఞానభేరి సదస్సు, 2019లో పసుపు కుంకుమ పంపిణీ పేరిట డ్వాక్రా మహిళలతో భారీ బహిరంగసభ నిర్వహించారు. ఇక టీడీపీ నేతల కుమారుల పెళ్లిళ్ల మొదలు.. 2018లో అప్పటి మంత్రి లోకేష్ పుట్టిన రోజు వేడుకలు కూడా ఏయూలోనే అట్టహాసంగా నిర్వహించారు, ఇలా ఏయూను పార్టీ కార్యాలయంగా వాడేసుకున్న టీడీపీ నేతలు.. ఇప్పుడు పచ్చ కామెర్ల వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు.. అభివృద్ధి పథంలో నడిపిన తీరుని మరిచిపోయి.. అవాకులు చెవాకులతో కూడిన విషపురాతలపై విద్యార్థి లోకంతో పాటు విద్యావంతులు చీదరించుకుంటున్నారు.


వీసీ కార్యాలయం సమీపంలో టీడీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న పార్టీ శ్రేణులు

కూటమి నేతల బరితెగింపు

పసుపు జెండాలు, కార్యకర్తలతో హడావుడి

విశాఖసిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కూటమి నేతలు బరితెగించారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్ ఒత్తిడితో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో పాటు రిజిస్ట్రార్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే దీన్ని రాజకీయం చేసేందుకు శనివారం వర్సిటీకి వచ్చిన కూటమి నేతలు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజులు వారి అనుచరగణంతో హల్‌చల్ చేశారు. పెద్ద ఎత్తున పార్టీ నగర కార్యకర్తలను వెంటేసుకొని వచ్చి వర్సిటీ వాతావరణాన్ని భయానకంగా మార్చారు. ప్రశాంత వాతావరణంలో బాణసంచా, డప్పుల మోతతో హంగామా సృష్టించారు. కొందరు టీడీపీ కార్యకర్తలు వర్సిటీ గేట్లుకు పెద్ద ఎత్తున పసుపుజెండాలను అంటించారు. కొందరు వర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఉన్న జాతీయ పతాకం వద్దకు వెళ్లి హల్‌చల్ చేయడంతో పాటు పసుపుజెండాలు ఊపారు. వీరంతా మూకుమ్మడిగా రావడడంతో వర్సిటీ ఉద్యోగులు పెద్ద ఎత్తున గుమ్మిగూడారు. రాజీనామా చేసినా వీసీ ప్రసాదరెడ్డిని వదిలేది లేదంటూ హెచ్చరికలు చేశారు. ప్రసాదరెడ్డితో పాటు ఆయని ఆరాచకాల్లో భాగస్వాములైన వారు ఎవరీ వదిలిపెట్టేదిలేదంటూ హెచ్చరించారు.



వీసీ చాంబర్‌పైకెక్కి రాజకీయ నినాదాలు చేస్తున్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు

న్యూస్‌రీల్

రిమ్‌పెక్ విన్యాసాల్లో ఐఎన్ఎస్ శివాలిక్


పెరల్ హార్బర్‌కు చేరుకున్న ఐఎన్ఎస్ శివాలిక్ బృందం

సింథియా: ప్రపంచంలోనే అతిపెద్ద నౌకాదళ విన్యాసం రిమ్ ఆఫ్ ది పసిఫిక్(రిమ్ పెక్)లో పాల్గొనేందుకు భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ శివాలిక్ హవాయిలోని పెరల్ హార్బర్‌కు చేరుకుంది. ఇండియా–జపాన్ మధ్య ద్వైపాక్షిక వ్యాయామం జిమెక్స్–2024 పూర్తయిన తర్వాత ఐఎన్ఎస్ శివాలిక్ పెరల్ హార్బర్‌కు చేరుకున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి. హార్బర్ దశలో బహుళ సింపోజియం, వ్యాయామ ప్రణాళిక చర్చలు, క్రీడా పోటీలు, పరస్పర డెక్ సందర్శనల్లో శివాలిక్ బృందం పాల్గొనుంది. ఈ నెల 27న ప్రారంభమైన ఈ విన్యాసాలు జూలై 7వ తేదీ వరకు కొనసాగుతాయి.

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌కు ఘన స్వాగతం


స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్

మహారాణిపేట: రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టి.. తొలిసారి శనివారం విశాఖ వచ్చిన సీహెచ్ అయ్యన్నపాత్రుడుని పలువురు జిల్లా అధికారులు, టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ విమానాశ్రయంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, అనకాపల్లి కలెక్టర్ రవి పటాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డీఐజీ విశాల్ గున్ని, డీసీపీ–2 మేకా సత్తిబాబు, స్థానిక నేతలు ఆయనకు స్వాగతం పలికారు. నగరంలోని ఓ హోటల్‌లో జిల్లాకు చెందిన నేతలు, అధికారులు స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

6 జట్లు.. 19 మ్యాచ్‌లు

- నేటి నుంచి ఏపీఎల్ మూడో సీజన్ ప్రారంభం
- పోటీపడనున్న ఆరు జట్లు
- సిద్ధమైన వైఎస్సార్ స్టేడియం


ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ట్రోఫీతో కెప్టెన్లు, నిర్వాహక కమిటీ ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: ముచ్చటగా మూడో ఏపీఎల్ సీజన్‌కు తెరలేచింది. ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) నిర్వాహక కమిటీ ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం నుంచి 14 రోజుల పాటు 19 మ్యాచ్‌లు జరగనున్నాయి. విశాఖలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆరు జట్ల ఫ్రాంచైజీలతో పాటు జట్ల కెప్టెన్లు పాల్గొని ట్రోఫీని ఆవిష్కరించారు. అన్ని మ్యాచ్‌లకు నగరంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ– వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. ఈ సీజన్‌లో రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో లీగ్ ప్రారంభం కానుంది. బంగారుపూత పూసిన రోలింగ్ ట్రోఫీని ఆవిష్కరించిన అనంతరం ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఏపీఎల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఆటగాళ్లు ఈ ప్లాట్‌ఫాంను చక్కగా వినియోగించుకున్నప్పుడే ఆ కష్టానికి ఫలితం దక్కుతుందన్నారు. మూడో సీజన్‌లో పాల్గొనే జట్లు సరికొత్త జెర్సీలతో సందడి చేశారు.

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో..

ఏపీఎల్ మూడో సీజన్ ప్రారంభ మ్యాచ్ ఆదివారం రాత్రి 6.30 గంటలకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో వైఎస్సార్ స్టేడియంలో ప్రారంభం కానుంది. లీగ్ మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్ తెలుగు, స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్‌ల్లో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. ఈ పోటీలను రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఎం.రాంప్రసాదరెడ్డి ప్రారంభిస్తారు. విశాఖ, విజయవాడ ఎంపీలు శ్రీభరత్, కేశినేని శివనాథ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మేయర్ హరివెంకటకుమారి, స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్, సీపీ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు పి.శరత్‌చంద్రరెడ్డి, గోపీనాథరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు.

రంజీలను తలపిస్తున్న ఏపీఎల్

ఏపీఎల్ విజయవంతంగా మూడో సీజన్‌కు చేరడం సంతోషదాయకం. ఇదో చక్కటి అనుభూతినిచ్చే ప్రయాణం. టోర్నీతో పాటు ప్రాక్టీస్ తదితరాలు రంజీ మ్యాచ్‌లను తలపిస్తున్నాయి. చక్కటి మ్యాచ్‌లు ఆడతాం.

– **కె.ఎస్.భరత్**, కెప్టెన్, వైజాగ్ వారియర్స్

ఏపీఎల్ ఓ బ్రాండ్

వరసగా మూడో సీజన్‌లోనూ పాల్గొనడం చాలా ఆనందాన్నిస్తోంది. ఏపీఎల్ అనేది ప్రస్తుతం దేశంలోనే ఓ బ్రాండింగ్ లీగ్ స్థాయికి ఎదిగింది. రాష్ట్రంలోని ఔత్సాహిక ఆటగాళ్లకు ఇదో చక్కటి అవకాశం. దీన్ని వినియోగించుకుని ఐపీఎల్‌లోనూ సత్తా చాటాలి.

– **రికీబుయ్**, కెప్టెన్, బెజవాడ టైగర్స్

గట్టి పోటీనిస్తాం

గత రెండు సీజన్లలోనూ జట్టు చక్కటి ప్రదర్శన చేసింది. నితీష్‌కుమార్ జట్టుకు అందుబాటులో లేకపోవడం కాస్త నిరాశ అనిపించినా చాలా మంచిగా ప్రాక్టీస్ చేసుకున్నాం. మూడో సీజన్‌లో ప్రయాణం మారింది. జట్టు ఆటగాళ్లు ఈ సీజన్‌లో గట్టి పోటీనిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

– **జ్ఞానేశ్వర్**, కెప్టెన్, గోదావరి టైటాన్స్

కొత్త ఊపుతో బరిలోకి..

గత రెండు సీజన్లలో చక్కటి ప్రదర్శన చేసినా ట్రోఫీ గెలవలేకపోయాం. అయితే ఈసారి జట్టులోని ఆటగాళ్ల కూర్పు సరికొత్తగా ఉంది. నేను కెప్టెన్‌గా కొత్తగా వచ్చినా.. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో ఓ అవగాహనతో ప్రాక్టీస్ చేశాం. నాకిష్టమైన జట్టు ముంబయి ఇండియన్స్. వారి జెర్సీ కలర్ బ్లూ. ఇప్పుడు మా జట్టుదీ అదే కలర్.

– **గుల్ఫమ్**, కెప్టెన్, ఉత్తరాంధ్ర లయన్స్

ఈసారి టైటిల్ సాధిస్తాం

ఏపీఎల్ అరంగేట్రంలోనే కప్పును గెలిచాం. గత సీజన్ ఫైనల్‌లో కాస్త తడబడ్డాం. ఈసారి టైటిల్ సాధించే దిశగానే అడుగులు వేస్తున్నాం. కెప్టెన్ రషీద్ ప్రారంభ మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడు. జట్టు ఆటగాళ్ల ప్రతిభను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటాం.

– **అభిషేక్**, వైస్ కెప్టెన్, కోస్టల్ రైడర్స్

టైటిల్ నిలబెట్టుకుంటాం

డిఫెండింగ్ చాంప్ జట్టుకు కెప్టెన్‌గా ఉండటం అంటే సవాలే. టైటిల్ నిలబెట్టుకోవాలి. అదే ఆలోచనలతో అనంతపురంలో జరిగిన ప్రాక్టీస్‌లో ఆటగాళ్లు కష్టపడ్డారు. ఈ సీజన్ ప్రారంభ మ్యాచ్ మాదే కావడంతో చాలా ఉత్సుకతగా ఉంది.

– **గిరినాథ్**, కెప్టెన్, రాయలసీమ కింగ్స్

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ల ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని, ఇలాంటి వేదికలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పేర్కొన్నారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు గాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిత్యం పనిచేస్తోందని గుర్తు చేశారు. జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ వద్ద శనివారం జరిగింది. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలన్నదే న్యాయ వ్యవస్థ అంతిమ లక్ష్యమని, ఆ దిశగా న్యాయమూర్తులు సేవలందిస్తున్నారన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాధితులకు అండగా నిలుస్తూ న్యాయ సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. లోక్ అదాలత్ లాంటి వేదికల్లో పౌర శిక్షాస్మృతి, నేర శిక్షాస్మృతి పరిధిలోని రాజీ కాగలిగిన కేసులు, మోటారు ప్రమాదాల కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు పరిష్కారానికి వస్తాయన్నారు. ప్రభుత్వ సంస్థలు, బీమా కంపెనీలు, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు, కక్షిదారులు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ, పునరినియోగం, కాలుష్య నివారణ పద్ధతులపై రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కోర్టు న్యాయమూర్తులు, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.రాధారత్నం, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, ఏపీ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


జాతీయ లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సన్మానం

విశాఖ సిటీ: విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన 17 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శనివారం తన ఛాంబర్‌లో సన్మానించారు. ఏడీసీపీ(సీఎస్‌బీ) ఎస్.వెంకట్రావు, ఎస్‌ఐలు డి.కాళిదాస్, జి.మోహనరావు, ఆర్ఎస్ఐ ఎస్.బాలరామారావు, ఏఎస్‌ఐలు జి.రాజేశ్వరరావు, ఎం.సత్యారావు, వి.నాగపాపారావు, కె.సుబ్బారావు, బి.ప్రకాషరావు, ఆర్.ఆర్.కె.శర్మ, ఎం.కమలాకర్‌రావు, ఏఆర్ ఎస్‌ఐలు పి.కనకరాజు, బి.వెంకటేశ్వరరావు, హెచ్‌సీ ఎస్.బ్రహ్మాజీరావు, డబ్ల్యూహెచ్‌సీ పి.గంగమ్మ, ఏఆర్‌హెచ్‌సీలు ఎం.బలరామ్, పి.ఎస్.సూర్యనారాయణలు శనివారం ఉద్యోగ విరమణ పొందారు. వీరిని సీపీ తన ఛాంబర్‌కు ఆహ్వానించి సత్కరించారు. ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు.


ఏడీసీపీ(సీఎస్‌బీ) ఎస్.వెంకట్రావును సన్మానిస్తున్న సీపీ రవిశంకర్

వీసీసీఐ నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీతో సభ్యులు

బీచ్‌రోడ్డు: విశాఖపట్నం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(వీసీసీఐ) నూతన కమిటీ ఎన్నికైంది. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం వీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎం.సుదర్శన్, ఉపాధ్యక్షుడిగా రవి గోడే, కార్యదర్శిగా పి.రాజేష్, కోశాధికారిగా పవన్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ నూతన కమిటీ 2026 వరకు కొనసాగనుంది.

గుణుపూర్ పాసింజర్ రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైలు ఆలస్యంగా చేరుకున్నందున విశాఖపట్నంలో శనివారం ఉదయం 5.30 గంటకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 8.30 గంటలకు బయలుదేరింది.

శేష జీవితాన్ని ఆనందంగా గడపండి

- జీవీఎంసీలో 78 మంది ఉద్యోగ విరమణ



ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరిస్తున్న అదనపు కమిషనర్‌లు

అల్లిపురం: మహా విశాఖ నగరపాలక సంస్థలో శనివారం 78 మంది అధికారులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేశారని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ చరిత్రలోనే ఇంత మంది ఉద్యోగ విరమణ చేయడం ఇదే ప్రథమమని అన్నారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు పి.రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌లతో కలసి ఆయన ఉద్యోగ విరమణ చేసిన 78 మంది ఉద్యోగులను సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఇద్దరు డ్రైవర్లు, ఏడుగురు ఫిట్టర్ హెల్పర్లు, చైన్‌మన్, 16 మంది మజ్దూర్లు, ఇద్దరు బోర్‌వెల్ అటెండర్లు, ఐదుగురు టర్న్‌కాక్‌లు, పీహెచ్ ముస్తీ, 32 మంది పీహెచ్ వర్కర్లు, నలుగురు మినిమం టైం స్కేల్ ఉద్యోగులు తదితరులున్నారు. కార్య నిర్వాహక ఇంజినీర్ బి.మోహనరావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వేణుగోపాలరావు, సహాయక ఇంజినీర్ టీవీ సత్యనారాయణ సేవలను అధికారులు కొనియాడారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.పద్మజ, బయాలజిస్ట్ సాంబమూర్తి, జెమ్స్ అసోసియేషన్ అప్పలనాయుడు, ఏపీఎంఈఎస్‌ఏ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, రవి, సన్యాసిరావు, జెమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పదవీ విరమణ అధికారులకు సన్మానం



సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ అధికారులు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏలో 35 ఏళ్లుగా వివిధ హోదాల్లో సేవలందించి పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులకు సన్మానించారు. సంస్థ పరిపాలనాధికారి ఎస్.టి.లక్ష్మీనారాయణ, తహసీల్దార్ వీరభద్రరావులు శనివారం పదవీ విరమణ పొందారు. దీంతో విభాగాధిపతులు, అధికారులు, సిబ్బంది వారిని సన్మానించారు. వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంయుక్త కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి దాట్ల కీర్తి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ఈఈలు బలరామరాజు, శ్యామల, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తాటిచెట్లపాలెం: గంజాయిని తరలిస్తున్న ఒకరిని విశాఖ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు పట్టుకున్నారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. విశాఖ రైల్వేస్టేషన్‌లో శనివారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పైడి మనోహర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కోరాపుట్‌కు చెందిన శివపాత్రో బ్యాగులను తనిఖీ చేయగా.. సుమారు 1.06 లక్షల విలువైన 21.3 కిలోల గంజాయిని అందులో గుర్తించారు. విశాఖ స్టేషన్ మీదుగా సికింద్రాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో ఆయన తెలిపాడు. గంజాయిని సీజ్ చేసి.. అతన్ని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయండి

- ప్రజా ప్రతినిధులకు తగిన ప్రాధాన్యమివ్వండి
- అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆదేశం
- 1 నుంచి 7 వరకు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

మహారాణిపేట: సామాజిక పింఛన్ల పంపిణీ వంటి ప్రభుత్వ కార్యక్రమాల అమలులో తమను కూడా భాగస్వాములను చేయాలని పలువురు జెడ్పీటీసీ సభ్యులు కోరారు. జిల్లా పరిషత్ సమావేశంలో శనివారం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా గొలుగొండ జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ మండలాల్లో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో తమకు తగిన ప్రాధాన్యం ఉండాలన్నారు.

- పాడేరు, అరకు ప్రాంతాల్లో ఎంతో మంది జాబ్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు తెలిపారు. మన్యంలో అర్హులకు వెంటనే జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. దీనిపై ఏఎస్ఆర్ జిల్లా డ్వామా పీడీ శివయ్య మాట్లాడుతూ ఐదు రోజుల్లో అర్హులకు జాబ్ కార్డులు మంజూరు చేస్తామన్నారు.
- మన్యంలో చాలా ప్రాంతాలకు రోడ్లు సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నిధులు మంజూరైనా రోడ్లు వేయకపోవడం అన్యాయమని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. సకాలంలో రోడ్లు వేస్తే డోలీ మోతలు ఎందుకని అధికారులను ప్రశ్నించారు.
- మన్యంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని పలువురు జెడ్పీటీసీలు గంగరాజు, గిరిబాబు, కర్రి సత్యం, కాకరదేవి అన్నారు. ఉన్నత చదువులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.
- మొక్కల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, నర్సీపట్నం ఏరియాలో మొక్కలు అడిగితే అధికారులు పట్టించుకోవడం లేదని జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, రైతులకు ఎటువంటి అవగాహన కల్పించడం లేదని దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని డ్వామా పీడీ సందీప్ తెలిపారు.
- పరిశ్రమల శాఖ అధికారులు తీరు బాగాలేదని ఎస్.రాయవరం జెడ్పీటీసీ సభ్యురాలు కాకరదేవి అన్నారు. వైఎస్సార్ బడుగు నివాసం పథకం కింద పరిశ్రమల శాఖ ద్వారా కారు తీసుకున్నానని, కాని నెలలు గడుస్తున్నా రాయితీ రాలేదని తెలిపారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని సీఈవో పోలినాయుడు అధికారులను ఆదేశించారు.
- సమావేశాల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు సంధించగా.. అధికారులు సమాధానమిచ్చారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ కొత్త ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు పలు కమిటీల్లో సభ్యులుగా ఉంటారని, ఈ విషయమై చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. స్థాయీ సంఘాల సమావేశాలకు కొందరు అధికారులు గైర్హాజరు కావడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటివి పునరావృతం అయితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మైదాన ప్రాంతాలతోపాటు గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ వంటి వాటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. దివ్యాంగులకు పింఛన్‌తోపాటు ఎరియర్స్ ఇవ్వాలన్నారు. సంక్షేమ ఫలాల అమలు కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాల పంపిణీ జరిగేదని, అదే తరహా కొనసాగించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు జిల్లాలో 1.38 లక్షల మంది ఉన్నారని, వీరికి అతిసారం సోకకుండా ప్రతి ఇంటికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణీ చేయాలని డీఎంహెచ్‌కు పి.జగదీశ్వరరావును ఆదేశించారు. అతిసారం సోకిన పిల్లల కోసం కేజీహెచ్‌లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం, బెడ్లు సిద్ధం చేశామని సూపరింటెండెంట్ శివానంద్ చైర్‌పర్సన్‌కు వివరించారు. అరకు ఎమ్మెల్యేగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగంను జిల్లా పరిషత్ తరపున ఆమె అభినందించారు. సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మైమరపించిన మాయాబజార్

- ప్రారంభమైన సురభి నాటకోత్సవాలు
- నేడు భక్త ప్రహ్లాద నాటకం ప్రదర్శన



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న బాదంగీర్ సాయి



అద్దంలో తనను చూసుకుని మురిసిపోతున్న బుల్లి ప్రహ్లాదుడు



మాయాబజార్ నాటకంలోని ఓ రసవత్తర సన్నివేశం



నాటకానికి సిద్ధమవుతున్న నటుడు



నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: రెప్ప వేసి తెరిచే లోగా ఎన్నో అద్భుతాలు.. సినిమా సెట్టింగ్‌లు.. ఘటోత్కచుని అసమాన నటనా కౌశలం.. శశిరేఖ అభిమన్యుల పరిణయ కోలాహలం.. వెండితెరను మరిపించేలా సురభి బృందం ప్రదర్శించిన మాయాబజార్ నాటకం ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. వైరు వర్కుతోనే రంగస్థలంపై మంటలు సృష్టించడం.. వర్షం కురిపించడం, వస్తువులను అదృశ్యం చేయడం.. ఇలా ఔరా అనిపించేలా ప్రదర్శనలు మైమరపించాయి. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం ఇందుకు వేదికైంది. రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో బాదంగీర్‌సాయి నేతృత్వంలో శనివారం సురభి నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలిరోజు మాయాబజార్ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహకులు బాదంగీర్ సాయి మాట్లాడుతూ నాటకోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తప్రహ్లాద నాటకం ఉంటుందన్నారు. సురభి నాటకం మన సంపదగా భావించి ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. పద్య నాటకం మన సంస్కృతి అని, సురభి నాటకం మన సంపదన్నారు. కాగా.. భక్త ప్రహ్లాద నాటకంలో ప్రత్యేక ఆకర్షణగా చిన్నారి(భక్తప్రహ్లాద పాత్రధారి) నిలవనున్నాడని నిర్వాహకులు తెలిపారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

నైపుణ్య ఆధారిత విద్యకు ప్రాధాన్యం

- కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్

మద్దిలపాలెం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నైపుణ్య ఆధారిత విద్యకు తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టెక్ మహీంద్రా మెగా జాబ్‌మేళా శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో సెమిస్టర్ కోసం కొత్తగా ప్రవేశపెట్టిన ఆంగ్ల పాఠ్యాంశాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో గ్రాడ్యుయేట్‌ల నైపుణ్యాన్ని గణనీయంగా పెంపొందిస్తున్నట్లు తెలిపారు. జాబ్ డ్రైవ్‌లను నిర్వహించడానికి నోడల్ రిసోర్స్ సెంటర్లను ప్రారంభిస్తామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి జాబ్ డ్రైవ్‌ల్లో పాల్గొనడం ద్వారా అనుభవాన్ని పొందుతారన్నారు. ఏపీ పీజీఈసెట్‌లో 100 కంటే తక్కువ ర్యాంకులను కృష్ణా కళాశాల విద్యార్థులు సాధించారన్నారు. కార్యక్రమంలో జేకేసీ కో–ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రంగ అభివృద్ధికి విశేష కృషి



మాట్లాడుతున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. సిరిపురంలోని చిల్డ్రన్ ఎరీనాలో శనివారం ఐటీఏఏపీ వైజాగ్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ రంగంలో ఎటువంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే.. వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం ఐటీ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. విశాఖలో ఐటీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. యువత స్టార్టప్ కంపెనీల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను రూపుమాపేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా ఐటీ ఉద్యోగులు డ్యాన్సులు, పాటలు, స్కిట్లు, ఫ్యాషన్ వాక్‌తో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఐటీఏఏపీ అధ్యక్షుడు లక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవితో పాటు 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

వివాహితను కాపాడిన రైల్వే పోలీసులు



వివాహిత నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

గోపాలపట్నం: సింహాచలం నార్త్ రైల్వేస్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహితను రైల్వే పోలీసులు కాపాడారు. వివరాలివీ.. కొత్తపాలెం దుర్గా గుడి సమీపంలో నివాసముంటున్న మంగ(30) అనే వివాహిత శనివారం ఉదయం 10.40 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై నడిచి వెళ్తోంది. ఇది గమనించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఎస్‌జీ రాజు ఆమెను అనుసరించాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న రైలు వైపు ఆమె పరుగులు తీసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో అప్రమత్తమైన కానిస్టేబుల్ ఆమెను పట్టుకుని ట్రాక్ బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను విచారించగా భర్తతో గొడవ పడి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్లు తెలిపింది. తర్వాత ఆమెను ఆర్పీఎఫ్ సిబ్బంది జీఆర్పీకి అప్పగించారు. వారు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి.. మంగకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోమారు ఈ విధంగా ప్రయత్నించవచ్చని సూచించారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



రవికుమార్ సన్మానిస్తున్న న్యాయమూర్తి సీఎస్ మూర్తి

విశాఖలీగల్: పదవీ విరమణ చేసిన ఉద్యోగులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని నగరంలోని కేంద్ర నేరా అన్వేషణ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి సీఎం మూర్తి అన్నారు. శనివారం సిరిపురం వీఆర్‌ఎండీఏ కార్యాలయం ప్రాంగణంలోని సీబీఐ కోర్టు ఆవరణలో కోర్టు పరిపాలన అధికారి పెనుమత్స రవికుమార్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ప్రతి ఒక్కరూ తమ సేవలను సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. న్యాయవ్యవస్థలో వస్తున్న పెను మార్పులను సమాజంలో పౌరులందరికీ చైతన్యం కలిగించే విధంగా తమ సేవలను కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. రవికుమార్ మాట్లాడుతూ దాదాపుగా 40 ఏళ్ల న్యాయ స్థానాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవాలను విశదీకరించారు. విశాఖ జిల్లా న్యాయ ఉద్యోగుల సంఘం సభ్యులు తమ్మినేని నరసింహారావు, రాష్ట్ర న్యాయస్థాన ఉద్యోగుల ప్రధాన సలహాదారు పైల సన్నిబాబు, ఉద్యోగులు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.